క్లుప్తంగా

ఉపాధి హామీ పనులతో లబ్ధి


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డి టౌన్ : ఉపాధి హామీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని ఇరిగిపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు పెరగడంతో రైతులు ఉదయం సమయంలో పనులు పూర్తి చేసుకుని వెళ్లాలని తెలిపారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలకు పని కల్పిస్తూ కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న మాజీ సర్పంచ్

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం మధుర గ్రామానికి చెందిన కుమ్మరి మౌనిక కుమారుడు అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందగా హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.60000 చెక్కు మంజూరయింది. బాధిత కుటుంబానికి శనివారం మాజీ సర్పంచ్ మాధవి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నవీన్‌గౌడ్ తదితరులున్నారు.

నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని బస్టాండ్ సమీపంలో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో ఆటోలను నడపొద్దని సూచించారు. అలాగే, ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై ఆటోలను నిలపొద్దని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్‌లో రూ.18 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ,మాజీ మున్సిపల్ చైర్మన్‌సత్యనారాయణ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న పాల్గొన్నారు.

మునిపల్లిలో..

మంత్రి దామోదర సహకారంతో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల చుట్టూ సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట లక్ష్మారెడ్డి , మాజీ సర్పంచ్ అంజిరెడ్డిలు ప్రారంభించారు.

మామిడి తోటకు రూ.36 లక్షలు

సంగారెడ్డి : జిల్లా కేంద్రంలోని కొండాలక్ష్మణ్ బాపూజీ ఫల పరిశోధన కేంద్రంలో 2025 సంవత్సరానికి సంబంధించిన మామిడి తోటకు వేలంపాట శనివారం నిర్వహించారు. వేలంపాటలో ప్రభుత్వానికి రూ.36లక్షల ఆదాయం వచ్చిందని ఎఫ్‌ఆర్‌ఎస్ శాస్త్రవేత్త సుచిత్ర తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్ట్ హరికాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

సదాశివపేట(సంగారెడ్డి): మండలంలోని గంగకత్వ వాగులో పూడికతీత పనులు చేపట్టాలని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. గంగకత్వ వాగులో పూడికతీత పనులు చేపట్టి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయకట్టు కింద 11 గ్రామాల పరిధిలోని చెరువులకు నీరు చేరడంతో పంటలు పుష్కలంగా పండే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూషణం, ఖయ్యూం, నర్సింలు, రాజు, శేఖర్, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించారు.. ఖాళీగా ఉంచారు..

- నిరుపయోగంగా చేపల మార్కెట్ భవనం
- మౌలిక వసతుల కల్పనలో విఫలం
- అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి


నిరుపయోగంగా ఉన్న చేపల మార్కెట్

జిన్నారం(పటాన్‌చెరు): గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన చేపల మార్కెట్ భవనం నిరుపయోగంగా మారింది. ఆ భవనానికి కనీస వసతులు ఏర్పాటు చేసుకొని వినియోగించుకోవడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు మండిపడుతున్నారు. చేపల మార్కెట్ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిందని విమర్శలున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి జిన్నారం మండల కేంద్రంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించారు. ప్రజాధనం లక్షలు వెచ్చించి .. ఖాళీగా ఉంచడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో భవనం అందుబాటులోకి వస్తుందనుకున్న స్థానికులకు నిరాశే మిలిగింది.

కనీస సౌకర్యాల కల్పనలో విఫలం

మండల కేంద్రంలో మత్స్యశాఖ నిధులతో నిర్మించిన చాపల మార్కెట్ భవనం నిరుపయోగంగా మారింది. భవన నిర్వహణకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. విద్యుత్, నీరు వంటివి లేకపోవడంతో భవనం వృథాగా మారి అందుబాటులో లేకుండా పోయింది. ప్రాథమిక స్థాయిలోని కనీస అవసరాలు కల్పించలేని అధికారుల తీరుపై మండల మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో భవనం నిరాధారణకు గురై మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది.

నిర్వహణకు సహకరించండి



చాపల మార్కెట్ భవనంలో విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించాలి. భవనం ప్రారంభంపై మత్స్యకారులు వారి కుటుంబాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇది వారి జీవనోపాధికి ఎంతో మేలు చేస్తుంది. అధికారులు భవన నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

– సుంకర బోయినమహేశ్ ,జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్, ఊట్ల

అందుబాటులోకి తేవాలి



చాపల మార్కెట్ భవనం వృథాగా మారడం చాలా బాధాకరం. చాపల విక్రయాలకు అనువుగా ఉంటుందనుకున్న భవనం పూర్తిగా అందుబాటులో లేకుండా పోయింది. అధికారులు భవనాన్ని వాడుకలోకి తీసుకువస్తే మత్స్యకారుల జీవితాలు బాగుపడతాయని ఆశిస్తున్నాం.

– నీలం రాము, మత్స్యకార సంఘం డైరెక్టర్, జిన్నారం

స్థానిక ఎన్నికల్లో యువతదే కీలక పాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న చరణ్‌రెడ్డి

సంగారెడ్డి జోన్: రాబోయే స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు కీలక పాత్ర పోషించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ చరణ్‌రెడ్డి సూచించారు. శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక సీట్లు గెలిపించుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ముందంజలో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, వివిధ నియోజకవర్గాల అసెంబ్లీ అధ్యక్షులు వెంకట్, నవీన్, సంగారెడ్డి, పృథ్వీసాగర్ రెడ్డి, యూత్ సభ్యులు ఇంద్రారెడ్డి, వసిం, గోవర్ధన్ రెడ్డి, శ్రీహరిగౌడ్, పవన్, ప్రేమ్ సింగ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కళాశాల అభివృద్ధి పనులు


ప్రిన్సిపాల్ మధుసూదన్


విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మధుసూదన్

హత్నూర(సంగారెడ్డి): హత్నూరలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ క్రాంతి కళాశాలలో కామన్ డైట్‌ను ప్రారంభించి.. అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా రెండు కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. దీంతో డార్మటలి బ్లాక్ నిర్మించడం దాదాపు పూర్తి కావస్తుందన్నారు. రూ.63 లక్షలతో కళాశాల ఆవరణలో మొత్తం మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తూ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.19.5 లక్షలతో సివిల్ వర్క్స్ కింద రిపేర్లు వాటర్ ట్యాంక్, ఎలక్ట్రికల్ తదితర వాటికి మరమ్మతులు కొనసాగుతున్నాయని చెప్పారు. హెట్రో కంపెనీ సౌజన్యంతో సీఎస్‌ఆర్ నిధులతో 40 కంప్యూటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సహకారం మంత్రి కొండా సురేఖ కృషి వల్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయని ప్రిన్సిపాల్ వివరించారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

డీఎస్పీ రవీందర్ రెడ్డి


అవగాహన కల్పిస్తున్న రవీందర్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలబాలికలను లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి వివరించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 11 ఏళ్లు అయినా కూడా ఇంకా సరైన అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులు ఆనందకరమైన బాల్యాన్ని పొందడం వారి హక్కు అన్నారు. కార్యక్రమంలో బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి, జిల్లా భరోసా కేంద్రం ప్రతినిధి దేవలక్ష్మి, హెచ్ఎం మంగీలాల్ ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పటాన్‌చెరు టౌన్: నూతనంగా ఏర్పడిన కాలనీల్లో సీసీరోడ్డు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిని నవభారత్ నిర్మాణ యువసేన అధ్యక్షుడు శ్రీధర్ శనివారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో ముత్తంగి చెరువు నీరు చిట్కుల్ పరిధిలోని నూతన కాలనీలు సాయికాలనీ, పార్థసారథి నగర్, డిఫెన్స్‌కాలనీ, నాగార్జున కాలనీల్లో గత ఏడాది వర్షపు నీరు కాలనీల్లో చేరి ఇబ్బంది పడ్డామని గుర్తు చేశారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దప్పు రాజు, రాములు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తి చేసిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మైక్రోసాఫ్ట్, ఎస్‌ఐటీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సోమవారం ఉ.10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్ టీం లీజ్, ధ్రువ సొల్యూషన్స్ మొదలగు కంపెనీలు నియామకాలు చేపడతాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు రెస్యూమ్, ఐదు సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలో పాల్గొనాలని సూచించారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ పథకం దరఖాస్తుదారులకు చెందిన స్థలాలను క్రమబద్ధీకరిస్తూ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఆన్‌లైన్ ద్వారా సకాలంలో ఫీజులు చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ కాపీలను అందజేస్తామన్నారు. ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కుట్టు శిక్షణ సామగ్రి పంపిణీ

నారాయణఖేడ్: పట్టణంలోని బంజారా భవన్‌లో కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలకు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం శిక్షణ సామగ్రిని పంపిణీ చేశారు. స్టేట్‌బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ద్వారా కుట్టు శిక్షణ ఇస్తున్నారు. వారికి అవసరమైన సామగ్రిని మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు అంజాగౌడ్, వెంకన్న, నగేష్, మల్గొండ, మశ్చేందర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, సీఆర్పీలు సుమలత, స్వప్న, విజేత పాల్గొన్నారు.

◆ ఘనంగా స్వయంపాలన దినోత్సవం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రం న్యాల్‌కల్‌లోని శ్రీవాణి విద్యాలయంలో శనివారం స్వయం పాలన దినోత్సవం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు. ప్రతిభ కనబర్చిన వారికి హెచ్ఎం బహుమతులు ప్రదానం చేశారు.

◆ పిడుగుపాటుతో మహిళకు తీవ్రగాయాలు

నారాయణఖేడ్: పిడుగుపాటుతో మహిళకు గాయాలు కావడంతో పాటు గేదె, మేక, గొర్రె మృతి చెందిన సంఘటన నాగల్‌గిద్ద మండలం గోవింద్‌నాయక్ తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన పూలి బాయి (55), తన వ్యవసాయ పొలంలో గేదె, మేక, గొర్రెను మేపుతోంది. ఈ క్రమంలో అకస్మాత్తుగా పిడుగు పడింది. పూలిబాయికి తీవ్రగాయాలు అవ్వడంతో పాటు గేదె, మేక, గొర్రె అక్కడిక్కడే మరణించాయి. బాధితురాలిని కరస్‌గుత్తి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శివకృష్ణ, ఆర్ఐ హన్మంత్‌రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

◆ ఏపీఎంకు నోటీసు అందజేత

జహీరాబాద్: ఈ నెల 25న వీఓఏలు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లేందుకు ఏపీఎం, మండల సమైక్య అధ్యక్షులకు శనివారం నోటీసు ఇచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్నందున విధులకు హాజరు కాబోమని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నపూర్ణ, విజయ్, అనసూజ, అశోక్, వీఓఏలు రాజ్‌కుమార్, సుబ్బారావు, గణేష్, లలిత, శశికళ, అనిత పాల్గొన్నారు.

◆ చెరువు వద్ద వ్యక్తి ఎముకలు లభ్యం

కంది(సంగారెడ్డి): చెరువులో వ్యక్తి కళేబరం లభించిన సంఘటన మండలంలోని చిమ్నాపూర్‌లోని ధర్మసాగర్ చెరువు వద్ద చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. శనివారం చిమ్నాపూర్ సమీపంలోని ధర్మసాగర్ చెరువులో తుంగ మధ్య వ్యక్తి కళేబరం కనిపించడంతో గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి సునీత బాయికి సమాచారం అందించారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తిగా తేల్చారు. సుమారు 5నెలల క్రితం మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఎముకలను శవపరీక్ష కోసం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

◆ ఇఫ్తార్ విందుతో సోదరభావం

పటాన్‌చెరు టౌన్: ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య సోదరాభావాన్ని పెంపొందిస్తాయని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్ డాక్టర్ ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందుకు కాటా శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన చేసి, అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ..ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

◆ నేడు అర్ధమండల దీక్షలు ప్రారంభం

నారాయణఖేడ్: అర్ధమండల హనుమాన్ దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి వరకు 21 రోజులు దీక్ష చేపట్టేవారు ఈనెల 23న ఉ.6 గంటల వరకు కొండాపూర్ హనుమాన్ క్షేత్రానికి చేరుకొని దీక్షలు స్వీకరించాలని కోరారు.

అధికసాంద్రత పద్ధతిలో పత్తి సాగు


అవగాహన కల్పిస్తున్న రాహుల్ విశ్వకర్మ

జహీరాబాద్: అధికసాంద్రత విధానంలో పత్తి పంటను సాగుచేయడం ఎంతో లాభదాయకమని సంగుపేట ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ, ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. శనివారం కోహీర్ మండలంలోని పిచరాగడి గ్రామంలో పత్తి సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో వేసిన పత్తిపంట సాధారణ పత్తికంటే ఎక్కువ దిగుబడిని ఇస్తుందన్నారు. ఎకరానికి మొక్కల సంఖ్య 22 వేల నుంచి 25వేల వరకు వేసుకోవాలని సూచించారు. తక్కువ పంట కాలం వల్ల ఒకేసారి పూత, కాయలు రావడం వల్ల పంట త్వరగా చేతికి వస్తుందన్నారు. అంతే కాకుండా పత్తి పంటపై ఎక్కువ గాయపరిచే గులాబీ పురుగు, కాయ తొలిచే పురుగు బారి నుంచి తప్పించుకుని నికర ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ పద్ధతిలో సాగు చేయడం వల్ల పంట కాలం తగ్గి రెండో పంటను సాగు చేసుకునేందుకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, రమేష్, స్నేహలత, ఏఓ నవీన్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దూకుడుగా ఆస్తి పన్ను వసూలు


చెక్కు అందజేస్తున్న పరిశ్రమ యాజమాన్యం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్ను వసూలు ప్రక్రియ దూకుడుగా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం పారిశ్రామికవాడకు చెందిన హైమేర్ సిస్టమ్స్ పరిశ్రమ ప్రతినిధులు రూ.6,63,230, ప్రీమియర్ డివైసెస్ రూ.3,02,446 పన్నులు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. బకాయిదారులు ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింలు మేనేజర్ మల్లికార్జున స్వామి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి పొదుపుతోనే భావితరాలకు భవిష్యత్తు


సిరిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): నీటిని పొదుపుగా వాడితేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్ అన్నారు. శనివారం పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నీటి పొదుపుపై ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు నీటి పొదుపు పాటించాలని సూచించారు. నీటి పొదుపు ప్రాముఖ్యత తెలిపే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన నీటి బిందువు ఆకారంలో ఉన్న చిత్రం అందరిని ఆకట్టుకుంది.

గుమ్మడిదల ఉన్నత పాఠశాలలో...

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీవీ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిమనదుల సంరక్షణ, గ్లోబల్ వార్మింగ్ ప్రాముఖ్యతపై ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్, దుబే సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి ఎస్ కృష్ణారావు, మేనేజర్ బాపిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ప్రాముఖ్యతపై ర్యాలీ

హత్నూర (సంగారెడ్డి): ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని హత్నూర మండలం సిరిపురం గ్రామంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో నీటి ప్రాధాన్యతపై వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నీటి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి


ఎల్‌ఆర్‌ఎస్ సర్టిఫికెట్లను అందజేస్తున్న కమిషనర్

పటాన్‌చెరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని ఇళ్ల యజమానులకు మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి పిలుపునిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లేఅవుట్‌ల్లో ప్లాట్లు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్న వారందరూ తమ ఇళ్ల రెగ్యులరైజేషన్‌కు ముందుకు రావాలన్నారు. శనివారం బృందావన్ టీచర్స్ కాలనీకి సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్ చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ పథకంతో అమీన్‌పూర్‌లోని చాలా మంది ఇంటి యజమానులకు లబ్ధి చేకూరిందని చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ లేకపోతే బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి లేదని, ఇళ్లను ఎవరూ అమ్ముకోలేరని స్పష్టం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ముందుకు వచ్చిన వారిని అభినందించారు.

శిశుమందిర్ పాఠశాల సీజ్


సీజ్‌చేసిన గదిని పరిశీలిస్తున్న నాయకులు

జహీరాబాద్: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గదిని మున్సిపల్‌శాఖ అధికారులు సీజ్ చేశారు. శనివారం కమిషనర్ ఉమామహేశ్వరరావు సిబ్బందితో పాఠశాలకు వెళ్లి బకాయిపడిన ఆస్తి పన్ను తక్షణమే చెల్లించాలని కోరారు. ఇందుకు పాఠశాల సిబ్బంది సానుకూలంగా స్పందించకపోవడంతో సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న హిందూ సంఘాల నాయకులు అధికారులతో మాట్లాడారు. సేవాభావంతో నడుపుతున్న సంస్థ గదిని సీజ్ చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు జోక్యంతో వేసిన సీల్ తొలగించారు.

పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

- వర్షాలకు పొంగిపొర్లుతున్న నాలా
- అవస్థలు పడుతున్న ప్రజలు


మురికి నీటిలో వెళ్తున్న వాహనదారుడు

జహీరాబాద్ టౌన్: పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల శనివారం కురిసిన వర్షానికి నాలాలోని మురికినీరు పొంగిపొర్లుతోంది. దీంతో సిద్ధేశ్వర ఆలయం వైపు వెళ్లే భక్తులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని గడి నుంచి సిద్ధేశ్వర ఆలయం వైపు ఉన్న ప్రధాన నాలా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారంతో నిండిపోయింది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నాలా వ్యర్థాలతో జామయ్యింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నాలా పొంగి రోడ్డుపై మురికినీరు పారుతుంది. ప్రజలు,భక్తులు మురికినీటి నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. మున్సిపల్ అధికారులు స్పందించి నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను ప్రజలు కోరుతున్నారు.


సిద్ధేశ్వర ఆలయానికి వెళ్లే దారిలో పొంగిపొర్లుతున్న నాలా